పెంటమీద కూర్చుని వాసన వస్తోంది అనుకోవటం ఎటువంటిదో అహంభావనలో కూరుకుపోయి అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది అనుకోవటం అటువంటిదే. పెంట మీద కూర్చొన్నవాడికి చెడ్డవాసన వస్తుంది కాని మంచివాసన ఎలా వస్తుంది. అలాగే దేహాభిమానంతో జీవించేటప్పుడు దుఃఖం వస్తుందికాని ఆనందం రాదు. నీ దేహప్రారబ్ధాన్ని బట్టి నీవు ఎక్కడ ఉన్నా, నువ్వు ఆత్మజ్ఞానం పొందటానికి నీకు ఏ లోపాలు అడ్డువస్తున్నాయో జాగ్రత్తగా చూసుకొని అందులోనుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు ఎక్కడ ఉన్నావు అనేది ముఖ్యంకాదు. నీ అలవాట్లలో నుండి, బలహీనతలో నుండి ఎంత వరకు బయటకు వస్తున్నావు అనేది ముఖ్యం. నిన్ను ఏ విషయాలు అయితే బంధిస్తున్నాయో వాటిలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసుకో. పశువును కట్రాడుకు కట్టేసినట్లు పూర్వజన్మ నుండి మోసుకొని వస్తున్న వాసనలు మనలను ఈ శరీరానికి కట్టేసి ఉంచుతాయి. ఈ శరీరం ముసలిది అయి చనిపోయింది అనుకో ఇంకో శరీరం వస్తుంది, కర్మ వాసనలు ఆ శరీరాన్ని పట్టుకొని ఉంటాయి. మీరు ఎక్కడ ఉన్నా ఆ వాసనలలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి, అదే సాధన. ఆత్మచింతన వలన అహంభావన తగ్గుతుంది, విషయచింతన వలన అహంభావన పెరుగుతూ ఉంటుంది. మీరు ఏది చింతిస్తున్నారో జాగ్రత్తగా చూసుకోండి. మీరు జ్ఞానం పొందటానికి ఏదో రూపం అడ్డువస్తోంది అనుకోండి, ఏదో నామం అడ్డువస్తోంది అనుకోండి. ఈ రూపం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది, ఈ నామం ఎవరు కల్పిస్తున్నారు, అహంభావన కల్పిస్తోంది అని అర్థం చేసుకొని దానిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 06-06-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నీరు ఒక్కటే దానిని అనేక భాషలలో అనేక రకాలుగా పిలుస్తారు. సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. దానినే బ్రహ్మం అంటారు. ఈశ్వరుడు అంటారు, యెహోవా అంటారు, అల్లా అంటారు. ఇలా ఒకో మతంలో ఒకో రకంగా పిలుస్తారు కాని సత్యం ఒక్కటే, నీవు పొందవలసిన గమ్యం ఒక్కటే అది మీరు గుర్తు పెట్టుకొంటే మనస్సులో ఆందోళన రాదు, ఈ మతం కంటే ఆ మతం గొప్పది, ఆ మతం కంటే ఈ మతం గొప్పది అనేటువంటి తలంపులు అసలు మీకు రావు. సత్యం ఒక్కటే దానిని బౌద్ధులు నిర్వాణం అన్నారు. నిర్వాణం అంటే శాశ్వతంగా దుఃఖం లేకపోవటం. ఒకరోజు సంతోషంగా ఉండి, ఇంకో రోజు దుఃఖంగా ఉంటే అది నిర్వాణం కాదు. శాశ్వతంగా దుఃఖం లేకపోవటం నిర్వాణస్థితి. నిర్వాణస్థితి పొందినవాడికి కోరిక ఉండదు, వాడికి పునర్జన్మ

లేదు. హిందువులు మోక్షం అంటారు. మోక్షం అంటే సత్‌చిత్ ఆనందం అని, అంటే ఎప్పడూ ఉండటం, ఆనందంగా ఉండటం, శాంతిగా ఉండటం. క్రైస్తవ మతంలో స్వర్గరాజ్యం అంటారు. సత్యాన్ని ఏమతం ఏ పేరుతో పిలిచినా హృదయంలో ఉన్న సత్యం ఒక్కటి అంటే ఒక్కటే. అది మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు శాశ్వతంగా శాంతి నిలబడుతుంది. మన కళ్లకు కనిపించే ప్రపంచం అంతా నిజం కాదు, అది నిజం అనుకోవటం వలన భయం వస్తోంది, ఆందోళన వస్తోంది. స్వప్నం ఎందుకు పెట్టాడు అంటే మనకు మంచి స్వప్నాలు వస్తాయి, చెడు స్వప్నాలు వస్తాయి. స్వప్నం జరుగుతున్నంతసేపు ఆ స్వప్నం నిజం కిందే ఉంటుంది. మెలుకువరాగానే అబ్బే ఏమీ లేదు, ఇది అంతా అబద్ధం అనిపిస్తుంది. అలాగే ఈ జీవితం కూడా స్వప్నం లాంటిదే. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా ఇది కూడా స్వప్నమే. ఆ స్వప్నం పొట్టిగా ఉంటుంది, ఇది పొడుగ్గా ఉంటుంది కాని అది ఎంత నిజం కాదో ఇది కూడా అంతే నిజంకాదు. ఇది మీకు కొంచెమైనా అర్థమవ్వకపోతే సాధన చేసినా మనస్సు అణగదు. స్వప్నంలో ఉన్నంత సేపు ఆ స్వప్నం నిజంకిందే ఉంటుంది అలాగే దేహాభిమానం ఉన్నంతకాలం ఈ సృష్టిలో జరిగే సంఘటనలు అన్నీ నిజంగానే ఉంటాయి. నిద్రలోనుండి మేల్కొన్నాక స్వప్నం అసత్యం అని ఎలా తెలుస్తుందో అలాగే నీ హృదయంలో మేల్కొన్నాక ఈ జగత్తు కూడా అసత్యమని నీకు తెలుస్తుంది. ఈ శరీరం మరణించక ముందే నీవు ఆ స్థితిని పొందితే ఇంక నీకు పునర్జన్మ లేదు.

కబీరుదాసు ఏమన్నాడు అంటే నీ హృదయంలో ఒక్కరికే చోటు ఉంది. ఎవడైనా ఒకడు అక్కడ కూర్చొన్నాడు అనుకోండి, మనం అక్కడ కూర్చోవాలి అంటే వాడిని లాగేయాలి కాని ఇద్దరు అక్కడ కూర్చోలేరు. నీ హృదయంలో అహంభావన కూర్చొంది అనుకోండి ఇంక దేవుడు రాడు ఎందుచేతనంటే వాడికి కూర్చోవటానికి అక్కడ చోటులేదు. మీ హృదయంలో దేవుడు కూర్చొన్నాడు అనుకోండి ఇంక అహంభావన రాదు. ఉంటే అహంభావన ఉండాలి లేకపోతే ఆత్మజ్ఞానం ఉండాలి. ఏది కావాలో మీరు చూసుకోండి. లోపల అహంభావన ఉంది అనుకోండి మీరు గుడులు చుట్టూ తిరిగినా, యాత్రలు చేసినా దేవుడు రాడు. మనం జపాలు చేసి, ధ్యానాలు చేసి, సాధనలు చేసి హృదయంలో నుండి అహంభావనను కనుక ఖాళీ చేస్తే మరుక్షణంలో ఈశ్వరుడు అక్కడ కూర్చొంటాడు. మీ హృదయంలో ఎవరు కూర్చొన్నారు జాగ్రత్తగా పరిశీలన చేసుకోండి అన్నాడు కబీరుదాస్. మీ కటుంబ పరిస్థితులు ఎప్పడూ ఒకరకంగా ఉండవు. వివేకానంద తండ్రి బతికి ఉండగా భోగం అనుభవించాడు, తండ్రి చనిపోయిన తరువాత తిండికి, బట్టకు కూడా ఇబ్బంది పడ్డాడు. అనేక కష్టాలను అనుభవించి

ఆయన ఒక మాట చెప్పాడు. సమాజ పరిస్థితులు కాని, మీ కుటుంబ పరిస్థితులు ఎప్పడూ ఒక రకంగా ఉండవు. మంచిప్రారబ్ధం రావచ్చు, చెడుప్రారబ్ధం రావచ్చు, అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. మీ దేహప్రారబ్ధమును బట్టి అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా, సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది ఎప్పడూ ఉండదు, అవి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. పరిస్థితులు మీ చేతిలో లేకపోయినా ప్రవర్తన మీ చేతిలో ఉంది. ఈ పరిస్థితులన్నింటి మధ్యలో, ఇవన్నీ చూస్తూ మీ ప్రవర్తనను కాపాడుకోండి అని చెప్పాడు. మా నాన్నగారు బతికి ఉండగా మా ఇంటి చుట్టూ తిరుగుతూ, మా నాన్నగార్ని స్తోత్రం చేసిన వాళ్ళే మా నాన్నగారు చనిపోయిన తరువాత మామీద దావాలు వేసారు. ఆ దావాలు వేసినవారు ఎప్పడైనా రోడ్డుమీద కనబడితే నాకు కొంచెం కోపం వచ్చేది. వాడిని దావా చేయవద్దు అని చెప్పినా వాడు మానడు. నా కోపాన్ని కంట్రోలు చేసుకోవటం నేర్చుకోవాలి కదా అనుకొన్నాను అని వివేకానంద చెప్పారు. వాడిని నేను ఎలాగ మార్చలేను, వాడిని చూసి నేను పాడైపోవటం కంటే సాధన చేసుకొంటూ నా నిదానంలో నేను ఉండటం మంచిది అనుకొన్నాను అని వివేకానంద చెప్పారు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు, వాటిని చూసి తొందరపడి మన ప్రవర్తన మార్చుకోకూడదు. మన ప్రవర్తన సరిగా లేకపోతే ఉద్రేకం వస్తుంది, కోపం వచ్చేస్తుంది, లోపల కుళ్ళిపోతాము.

మీరు ఎక్కువగా స్నేహాలు చేయవద్దు, తగుమాత్రంగా చేయండి. ఎక్కువగా స్నేహం చేసి మీ గుండెకు హత్తుకోవద్దు. ఎందుచేతనంటే వాడు మీకు శత్రువు అయ్యాడు అంటే వెంటనే మీకు దుఃఖం వచ్చేస్తుంది. ఎవడైనా మీకు శత్రువు ఉన్నా వాడిని మీరు ద్వేషించవద్దు, దాని వలన మనస్సు బాహ్యముఖానికి పోతుంది, మన ప్రవర్తనలో తేడా వచ్చేస్తుంది. అందుచేత మీరు ఉదాసీనంగా ఉండి మీ పని ఏదో మీరు చూసుకోండి. మనకు మంచివారు గురువులే, చెడ్డవారు కూడా గురువులే. మంచి వారిని చూసి నేర్చుకొనేది ఉంటుంది. చెడ్డవారు ఎందుకు గురువులు అంటే మా జోలికి రావద్దు అని వారు చెపుతున్నారు. మీకు ఏదైనా నష్టం వచ్చింది అనుకోండి, మీ మనస్సులో కుంగు రాకూడదు. మీరు ధనవంతులు అయినా మాయే, మీరు ఇంటి దగ్గర ఇబ్బందులు పడుతూ ఉన్నా అది కూడా మాయే. మీకు ఏదైనా లాభం వచ్చి మీరు పొంగిపోయినప్పడు కూడా మీ మనస్సులో ముద్రలు పడతాయి. మీకు నష్టం వచ్చి మీరు కుంగిపోయినప్పడు మీ మనస్సులో ముద్రలు పడతాయి. లాభనష్టములు మీ కూడా రావు కాని మనస్సులో పడిన ముద్రలు, ఆ వాసనలు మీరు చనిపోయాక మీ కూడా వచ్చేస్తాయి, ఇది మీరు అర్థం చేసుకోండి. శరీరానికి సంబంధించిన ఎక్సర్సైజులే యోగం అని కొంతమంది

అనుకొంటున్నారు. మీ జీవితంలో జరిగే సంఘటనల ప్రభావం మీ మీద పడకుండా చూసుకొంటే మీ బుద్ధి నిర్మలంగా ఉంటుంది, నిశ్చలంగా ఉంటుంది, సమానంగా ఉంటుంది. సమాన బుద్ధి కలిగియుండటమే యోగం అని పరమాత్మ చెపుతున్నాడు, అప్పడు మీకు పునర్జన్మ హేతువులు నశిస్తాయి. ఈ జీవుడు నిజంకాదు, నీకు వందకోట్ల డబ్బు ఉంది అనుకో అదీ నిజం కాదు, నీవు తిండికీ బట్టకీ ఇబ్బంది పడుతున్నావు అనుకో అదీ నిజం కాదు. ఇవి ఎంత నిజం కాదో అంత నిజంలాగ నీకు కనిపిస్తున్నాయి కాబట్టి హెచ్చు తగ్గులకు, కష్టనష్టాలకు గురి అవుతున్నావు, బాహ్యమైన పరిస్థితులకు లొంగిపోతున్నావు. నిన్ను నీవు బేలెన్స్ చేసుకో, నీ మనస్సును ఎప్పడూ సమానంగా ఉంచుకో, అదే యోగం.

శాస్త్రంలో విషయ కామం, ఈశ్వర కామం అని చెపుతారు. కామం అంటే కోరిక. విషయాల మీద కోరిక ఉంటే అది విషయ కామం. ఈశ్వరుడిని పొందాలి అనే కోరిక ఉంటే అది ఈశ్వరకామం. విషయ కామం ఉన్నవాడు ఆజన్మకు ఆ జన్మ పతనమయి పోతాడు, నీచమైన జన్మలలోనికి వెళ్ళిపోతాడు. ఈశ్వరుని పొందాలి అనే తపన నీకు ఉంటే ఆయన నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. ఈశ్వరుడు నీకు స్వరూపంగా వ్యక్తమైనప్పడు ఈశ్వర కామం అణిగిపోతుంది. పని పనికోసం చేస్తే కర్మ నిన్ను చుట్టుకోదు. మనం చేస్తే ఇష్టంగా చేస్తాము లేకపోతే అయిష్టంగా పని చేస్తాము అందుచేత కర్మ మనలను చుట్టుకొంటుంది. ఇష్టానికి, అయిష్టానికి మనం దూరంగా ఉండలేకపోతున్నాము, అది మనం నేర్చుకోలేకపోతున్నాము. ఓ అరుణాచలేశ్వరుడా! ఏ విద్యను నేర్చుకొంటే నువ్వు నాకు తెలుస్తావో అటువంటి విద్యను నాకు నేర్పించు. ఈ భౌతిక విద్యలు అన్నీ జిమ్మిక్కులు, మేజిక్కులు. ఇవి పొట్టకీ, గౌరవం తెచ్చుకోవటానికి బాగానే ఉంటాయి, సన్మానాలు మిగులుతాయి, అసలు సున్న. ఈ జిమ్మిక్కులలో నుండి నన్ను విడుదల చేసి, ఏ విద్య నేర్చుకొంటే ఈ మోహంలో పడకుండా, నీ మోహంలో పడి నిన్ను తెలుసుకొనే శక్తి నాకు కలుగుతుందో అటువంటి విద్యను నాకు నేర్పించు అంటున్నారు భగవాన్. పెద్ద తాచుపాము వచ్చి మనల్ని కరిచేస్తుంది అనుకోండి, దానివలన పెద్ద ప్రమాదం ఏమీ లేదు, ఈ శరీరం ఒక్కటే చనిపోతుంది, మరల కొత్త శరీరం వస్తుంది. మాయా విషం అలా కాదు పాము విషం కంటే చాలా ప్రమాదం. మాయా విషం కొన్ని కోట్ల జన్మలు తిప్పేస్తుంది, మామూలు జన్మలు అయినా ఫరవాలేదు నీచమైన జన్మలు వస్తాయి. మాయా విషం తలకెక్కి నేను శుభ్రంగా పాడవ్వకముందే నువ్వు నన్ను రక్షించు అరుణాచలేశ్వరా అన్నారు భగవాన్. ఇప్పడు మీరు ఎవరినైనా ప్రేమిస్తున్నారు అనుకోండి, మీ కూతురునుగాని, మీ భర్తనుగాని, మీ మనవళ్ళి గాని ప్రేమిస్తున్నారు అనుకోండి, అది వాళ్ళ

కోసం వారిని ప్రేమిస్తున్నారా? మీ కోసం వాళ్లని ప్రేమిస్తున్నారా? ఇది ఇంటిదగ్గర ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకోండి. వాళ్ల కోసం వారిని ప్రేమించటంలేదు, మీ కోసమే వాళ్లని ప్రేమిస్తున్నారు. ఎందుచేతనంటే వారికి మీకు ఏదైనా పేచీ వచ్చింది అనుకోండి. మీరు వారిని వదిలేస్తారు, తల్లి కొడుకుని వదిలేస్తుంది, కొడుకు తల్లిని వదిలేస్తాడు, తల్లీ కొడుకులు అనేక మంది దావాలు వేసుకొన్నవారు ఉన్నారు. మీ కోసమే మీరు ఇతరులను ప్రేమిస్తున్నారు. మీలో ఉండి ఆ ప్రేమించే వాడు ఎవడు? ఆ నేను ఎవడు? ఇది బాగా అర్థం చేసుకోండి. నీకు మొదట నేను అనే తలంపు వచ్చాకే అన్ని తలంపులు వస్తున్నాయి. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో అది తెలియకుండా నీకు జ్ఞానం రాదు. ఒకవేళ నీవు రెండు కళ్లతోటి దేవుడిని చూసినా, ఒకవేళ నీకు రాముడు కనిపించినా నీకు వరాలు ఇవ్వవచ్చు, ఆ వరాలు నీవు అనుభవించవచ్చు. ఇక్కడ మనం కూర్చొని మాట్లాడుకోవటం ఇది ఎంత నిజమో ఆ వరాలు కూడా అంతే నిజం కాని అది నగ్నసత్యం కాదు. ఆ ఇచ్చినవాడు ఎంత నిజమో, అనుభవించేవాడవు నువ్వు కూడా అంతే నిజం. మనకు వివేకం లేదు, సహనం లేదు అందుచేత సబ్జక్టు అర్థం చేసుకోలేకపోతున్నాము. చెప్పిన మాట అర్థం చేసుకోవటానికి సహనం ఉండాలి, వివేకం ఉండాలి. ఎవరైనా మిమ్మల్ని గౌరవించినప్పడు ఒక రకంగా ఉంటారు, అగౌరవ పరచినప్పడు ఒక రకంగా ఉంటారు. ఈ గౌరవాలు అగౌరవాలు కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. వాటివలన మీరు లోపల పొందిన స్పందనలు, వికారాలు మటుకు వచ్చే జన్మకు వచ్చేస్తాయి. మరల చాలా కష్టపడి సాధన చేస్తేనే కాని అవి పోవు.

కర్మ, ఉపాసన, జ్ఞానం. ఇక్కడ మన తెలివితేటలు ముఖ్యం కాదు. భగవంతుడు ఏ పని అయితే చేయవద్దు అని చెప్పాడో ఆ పని మానివేయటమే. నువ్వు ఎవరినీ ద్వేషించవద్దు అని చెప్పాడు అంటే ద్వేషించటం మానివేయటమే. స్నేహాలు అతిగా ఉండకూడదు అని చెప్పాడు. అంటే ఎవరితోను అతిగా ఉండటం మానివేయటమే. భగవంతుడు ఏదైతే చేయమని చెప్పాడో అది మనం చేయటమే. ఏదైతే వద్దని చెప్పాడో అది మానివేయటమే. ఈ పని ఎందుకు చేయమన్నాడో, ఆ పని ఎందుకు వద్దు అన్నాడో అది భగవంతుడికి తెలుస్తుంది కాని మన బుర్రకు అందదు. జీవుడు సర్వజ్ఞుడు కాదు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు. పది రోజులు మీరు పని పనికోసమే చెయ్యండి. ఇష్టంగా ఉండవద్దు, అయిష్టంగాను ఉండవద్దు, అప్పడు మీ మనస్సు చల్లారిపోతుంది. ఉపాసన అంటే మీకు ఏ దేవుడు ఇష్టమైతే ఆ దేవుడి యొక్క నామాన్ని స్మరించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం అదొక పద్ధతి. మీకు నేను అనే తలంపు వస్తోంది కదా. అది ఎక్కడ నుండి అయితే వస్తోందో అక్కడ దానిని నిలబెట్టి ఉంచటం, అంటే

మీరు మెదడులో ఎంత సహజంగా ఉంటున్నారో అంత సహజంగా హృదయంలో ఉండగలగాలి, అది కూడా ఉపాసనే. మనస్సు హృదయంలో ఉంటే దానికి విషయచింతన ఆగిపోయి నెమ్మదిగా నశిస్తుంది. నామజపం వలన, రూప ధ్యానం వలన రజోగుణం తగ్గిపోయి సత్వగుణం పెరుగుతుంది. సత్వగుణం మీకు జ్ఞాన మార్గాన్ని చూపించి అది ప్రక్కకు తప్పకొంటుంది. అవి ఉపాసన వలన లాభాలు. చెయ్యవలసిన సత్కర్మ చేసాక, మీరు ఉపాసన చేసాక ఫైనల్‌గా మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు ఆత్మజ్ఞానం కలిగే వరకూ ఈ కర్మ విడిచిపెట్టదు, దేహం విడిచిపెట్టదు, బంధం విడిచిపెట్టదు, పుణ్యాలు పాపాలు విడిచిపెట్టవు, బాహ్యాకర్షణలు మిమ్మల్ని విడిచిపెట్టవు.

నాకు భయం వేస్తోంది అని ఈరోజు ఎవరో వచ్చి నన్ను అడిగారు. గాఢనిద్రలో మీకు భయం లేదు. జాగ్రదవస్థలోనికి వచ్చాక మీకు భయం వస్తోంది. గాఢనిద్రలో మీకు నేను అనే తలంపు లేదు. అది లేనప్పుడు ఏ గొడవ లేదు. జాగ్రదవస్థలో నేను అనే తలంపు వచ్చాక ఇతరులు వస్తున్నారు. ఇతరులను చూస్తే మీకు భయం వేస్తోంది. ఈ నేను అనే తలంపు ఎంత నిజమో ఇతరులు కూడా అంతే నిజం నీకు వచ్చే భయం కూడా అంతే నిజం. ఈ నేను అనే తలంపే నిజంకాదు అని నీకు అర్థమైంది అనుకో ఇంక ఇతరులు లేరు, నీకు భయం ఇక్కడే అణిగిపోతుంది. ఏది వచ్చాక అంతా వస్తోందో తెలుసుకొని అందులో నుండి విడుదల పొందు. దానిలో నుండి విడుదల పొందితే అదే కడసారి జన్మ. మనం ఎవరికైనా సలహా చెపుతాము అనుకోండి. వారు వినరు అనుకోండి వెంటనే మనం కోపం తెచ్చేసుకొంటాము, అక్కడ నుండి మన పతనం ప్రారంభమవుతుంది. అలాకాదు, మనం ఎవరికైనా మంచి చెప్పాలంటే చెప్పవచ్చు, మనం మనంలాగ ఉండి చెప్పాలి. వాళ్ళు వినరు అనుకోండి మనం వికారం తెచ్చుకోకూడదు. అంతేకాని మేం చెప్పినట్లు వాళ్ళు వినటం లేదు, మేము చెప్పినట్లు వారు చెయ్యాలి అంటే మరల మాయలో పడిపోతాము. నేను చెడు సహవాసాలలో పడకముందే, లౌకికుల మాయలో పడకముందే నువ్వు నాయందు దయ చూపించి, నన్ను రక్షించు అంటే నేను చెడుస్నేహాలు చేసి బుద్ధి పాడుచేసుకొన్నాను అనుకో, ఆ స్నేహితుల మాట వినాలనిపిస్తుంది, కాని నీవు నాకు యజమానివి అయినా కూడా నీమాట నాకు వినాలనిపించదు. అందుచేత దుష్ట సహవాసం చేయకముందే నన్ను రక్షించు అరుణాచలేశ్వరుడా! అన్నారు భగవాన్. గౌడపాదుడు ఏమన్నాడు అంటే అసలు ఈ జీవుడు పుట్టలేదు. ఈ పుట్టుక అబద్ధం, చావు అబద్ధం, నువ్వు అనుభవించే కష్టసుఖాలు అబద్ధం. నీకు చైతన్యం గురించి తెలియకపోవటం వలన వచ్చిన గందరగోళం ఇది అంతా. అది తెలిసాక ఇది ఏమీ లేదు, అంతా సున్న అని నీకు

తెలుస్తుంది అని చెప్పాడు. జీవుడు అంటే శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే మన ముందు అద్దం పెడితే మన ప్రతిబింబం అక్కడ కనిపిస్తుంది. అలాగే ఉన్న వస్తువు బ్రహ్మమే అంతఃకరణం అనే అద్దంలో జీవుడిలా కనిపిస్తున్నాడు. అద్దం ఏవిధంగా అయితే నీ ప్రతిబింబం కనబడటానికి ఉపయోగపడుతుందో అలాగే అంతఃకరణం ద్వారా భగవంతుడు ప్రతిబింబిస్తున్నాడు, ఆ ప్రతిబింబమే జీవుడు. అద్దం పగిలిపోయింది అనుకోండి ఇంక ప్రతిబింబం లేదు, మీరు పోరు కాని ప్రతిబింబం పోతుంది. అలాగే అంతఃకరణం నశిస్తే జీవుడు లేడు. నువ్వు నువ్వుగానే ఉన్నావు కాని ప్రతిబింబాన్ని చూసి నువ్వు అనుకొంటున్నావు. అది నువ్వు కాదు, నీనీడ మాత్రమే. అది నీకు అర్థమైతే జీవుడు నశిస్తాడు. ఈ జీవకోటి అంతా నీడలే. దేహవాసన, లోకవాసన మనిషిని పీడించేస్తాయి. లోకవాసన ఉన్న వాడికి ఎంత సేపు గొప్పలు కావాలి, వారిని వారు పొగుడు కొంటారు, ఇతరులను తిడుతూ ఉంటారు. దేహవాసన ఉన్న వాడికి 24 గంటలు దేహం గొడవలే. దేహం ఉంది కాబట్టి కొంచెం అన్నం పెట్టాలి, ఏదో బట్టకట్టాలి మీ పని ఏదో మీరు చూసుకోవాలి. అంతేగాని అస్తమాను దేహం గొడవలో ఉండకూడదు. దేహం కారు టైరు లాంటిది. టైరుకు పేచ్చీ పడింది అనుకోండి, ఆ పేచ్చీ వేయించుకొని మరల కారుకు తగిలించుకొని తిప్పకొంటాము. అలాగే దేహానికి రోగం వస్తే మందులు వేసుకొని ఆ రోగం తగ్గించుకొని ఈ దేహాన్ని ఆత్మజ్ఞానం పొందటానికి ఉపయోగించుకోవాలి. ఇక్కడ విన్న విషయాలను ఇంటికి వెళ్లి శ్రద్ధగా వాటిని మీ మనస్సులో తిప్పకొంటే, మీ బుద్ధికి అర్థమయ్యేలాగ చేసుకొంటే అప్పుడు మీరు బాగుపడతారు. మీరు బాగుపడటానికి ఎవరు సహకరిస్తున్నారు, మీ దేహం సహకరిస్తోంది. మీ దేహాన్ని అలాగ ఉపయోగించుకోండి. మీకు దేహం ఉంది కాబట్టి ఇక్కడకు వచ్చి శ్రవణం చేస్తున్నారు. దేహం చనిపోయిన తరువాత జిన్నూరు రాగలరా. అందుచేత దేహం ఉండగానే ఈ దేహాన్ని ఉపయోగించుకోండి. మీకు సబ్జక్టు సరిగా అర్థమైతే, అది సరిగ్గా మీ మెదడుకు పడితే మీకు నిర్వాణస్థితి వచ్చేస్తుంది. అప్పుడు ఎదుటి వారు మిమ్మల్ని చెడగొట్టాలన్నా అది ఆగదు. రైలు వెళుతోంది అనుకోండి ఏదో గొర్రె అడ్డు వస్తే రైలుకు నష్టం ఏమిటి? ఆ గొర్రె పోతుంది. మీలో చెడువాసనలు ఉన్నా మీరు సత్కర్మ చేస్తూ ఉంటే, విచారణ చేస్తూ ఉంటే, ఆ వాసనల వలన వచ్చే నష్టం గ్రహిస్తూ ఉంటే, ఆత్మజ్ఞానం యొక్క వైభవం శ్రవణం చేస్తూ ఉంటే, సబ్జక్టు మీకు అర్థమైనప్పుడు ఆ ప్రవాహ వేగంలో ఈ వాసనలు అన్నీ కొట్టుకొనిపోతాయి.

అరుణాచలేశ్వరుడు దేవుడు దేవుడు అని అందరూ చెప్పకొంటూ ఉంటే నేను వచ్చాను. తీరా వచ్చాక నీవు ఏమి చేసావు. నా దేహాన్ని నాకు కాకుండా చేసావు. అది నువ్వు కాదు, అది

నువ్వు కాదు అంటూ నన్ను దిగంబరుడిని చేసావు. ఏదో గొప్ప గౌరవం తీసుకొని వస్తావు అనుకొన్నాను, అవన్నీ సున్నా చేసావు. దేహమే ఆత్మ, దేహమే సర్వస్వం అనుకొనే బుద్ధిని నాశనం చేసావు. అనాత్మ గొడవలు అన్నీ తీసేసి నా హృదయం అంతా అమృతంతో నింపావు. ఇది అంతా నాకు తెలియకుండా చేసేసావు. నాకు తెలియాలి అని నీవు అనుకోవటం లేదు. అయితే ఏదో రమణస్వామికి చేసేసాము నాపని అయిపోయింది అనుకోకు, నా బోటి వారు అనేకమంది నీ దగ్గరకు వస్తారు, వారికి కూడా ఆ స్థితిని ప్రసాదించు అరుణాచలేశ్వరుడా అన్నారు రమణస్వామి. మీరు ఇంటి దగ్గర కుటుంబ సభ్యులతో కూడా భాష బాగా మాట్లాడండి, ఎవరినీ దున్నపోతు అని అలా అనకండి. భాష సరళంగా, సౌమ్యంగా ఉండాలి. భాష బాగా మాట్లాడుతూ ఉంటే మీకు మంచి ఆలోచనలు వస్తాయి. మీరు ఇంట్లో వారిని అస్తమాను దున్నపోతు, దున్నపోతు అంటే మీరు దున్నపోతుకింద అయిపోతారు. మీరు చెప్పే భాష బాగుంది అనుకోండి మీరు ఎవరిని బాగు చెయ్యాలి అనుకొంటున్నారో వాడు ఎంతోకొంత బాగుపడతాడు, మీరు బాగుపడతారు. మీరు మాట్లాడే భాష సౌమ్యంగా, సరళంగా లేదు అనుకోండి, హితవుగా లేదు అనుకోండి మీ భాష విన్నవారు పాడవుతారు, మీరు పాడవుతారు. అందుచేత మాట్లాడే మాట చక్కగా ఉండాలి, సంస్కరింపబడిన భాష మాట్లాడాలి. పనిపట్ల శ్రద్ధగా ఉండండి, ఫలితం పట్ల వద్దు, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు, మీ డ్యూటీ మీరు చెయ్యండి, కొంతమంది సంతోషిస్తారు, మీరు శ్రద్ధగా చేసినా కొంతమంది సంతోషించరు. ఆ గొడవ వదిలివేయండి, మీ నిదానంలో మీరు ఉండండి. ఇప్పుడు మనం అన్నం తిన్నాము అనుకోండి దాని శక్తి సాయంత్రం వరకు పనిచేస్తుంది. అలాగే నువ్వు ఒక అరగంట పూజ చేస్తే, ఒక అరగంట జపం చేస్తే, ఒక అరగంట ధ్యానం చేస్తే 24 గంటలు ఆ శక్తి పనిచేస్తుంది. నువ్వు ఇంకా ఇంకా లోపలకు వెళ్ళావు అనుకో నిర్గుణం అయిపోతావు, అసలు ప్రపంచం ఉంది అని కూడా నీకు తెలియదు. నువ్వు రోజూ చేసే సాధన నిజమో కాదో చూసుకోవాలి. అది ఎలా తెలుస్తుంది అంటే ఇంతకుముందు నువ్వు ఎవరినైనా ద్వేషిస్తున్నావు అనుకో నువ్వు చేస్తున్న సాధన నిజం అయితే ఆ ద్వేషం చల్లారిపోతుంది. బయట వస్తువుల పట్ల, బయట సంఘటనల పట్ల, బయట వ్యక్తుల పట్ల నీ దృక్పథమే మారిపోతుంది. సాధన యొక్క వైభవం అటువంటిది. మీ ఇంటికి దురదృష్టం వస్తే ఏదో పోయింది అని మీకు అనిపించదు. మీకు అదృష్టం వస్తే ఏదో వచ్చిపడిపోయింది అని కూడా మీకు అనిపించదు. ఇదంతా సాధనాబలం వలన వస్తుంది. మీకు సాధనాబలం లేకపోతే అదృష్టం వస్తే పొంగిపోతారు, దురదృష్టం వస్తే డిప్రెషన్‌లోనికి వెళ్ళిపోతారు.

న్యూటన్‌కు ఆయన పెంచుకొనే పిల్లి అంటే చాలా ఇష్టం. న్యూటన్ ఫిజిక్స్ మీద 500 పేజీలు నోట్స్ వ్రాసుకొన్నాడు. ఆయన వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఆ పిల్లి టేబుల్ మీదకు ఉరికింది. అక్కడ ఉన్న కొవ్వొత్తి పుస్తకం మీద పడి పుస్తకం కాలిపోయింది. వాళ్ళు ఎంత ఓర్పు గలవారో చూడండి. ఆ పిల్లిని ఆయన తిట్టలేదు, కొట్టలేదు. చేతిలో గ్లాసు పొరపాటున పడితేనే మనం ఇంట్లోని వారిని పట్టుకొని తిడతాము. ఆయనకు పిల్లిమీద కోపం రాలేదు. అయ్యో పిల్లి ఎంత పని చేసావు అనుకొన్నాడు. మరల కష్టపడి నోట్సు వ్రాసుకొన్నాడు. ఇది మీకు ఎందుకు చెపుతున్నాను అంటే అంత ఓర్పు, సహనం వారికి లేదు అనుకోండి, హృదయం యొక్క లోతులలోనికి వెళ్లలేరు, కొత్త విషయాలు కనిపెట్టలేరు. కొత్త విషయాలు కనిపెట్టి వాడు సంపాదించినది ఏమీ లేదు, లోకం సుఖపడుతోంది. కొంతమందికి స్వభావంలో తెలికతనం ఉంటుంది, మెదడు అంతా విషంతో నిండి ఉంటుంది. వారు కొత్త విషయాలు తెలుసుకోలేరు. మనం సాధనలు చేసినా మన మనస్సులో కనుక నీచత్వం ఉంటే మనకు జ్ఞానం కలుగదు. మన శరీరం ఏదో టైములో వచ్చింది, ఏదో టైములో పోతుంది, మనకు ఏదో టైములో దుఃఖం వస్తుంది, అది ఏదో టైములో పోతుంది. విటన్నింటిని మాత్రలు అంటారు. ఒకకాలంలో ఉంటుంది ఇంకోకాలంలో ఉండదు. ఈ మాత్రలతో సంబంధం లేకుండా అమాత్ర ఒకటి ఉంది. అదే బ్రహ్మం. అది తెలుసుకోవటానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము, వచ్చిన పని మర్చిపోవద్దు. అక్కడికి వెళ్ళు, అక్కడికి వెళ్ళు, అది నీ హృదయంలోనే ఉంది. కొంతదూరం వెళ్లి వెనక్కి వచ్చేయకు. నీ హృదయంలో ఉన్న బంగారం దొరికే వరకు అక్కడకు వెళ్ళు. అదే సాధన. జ్ఞానం పొందినవాడు ఎలాగైనా శాంతిగానే ఉంటాడు. వాడి దర్శనం వలన మనకు ప్రయోజనం ఏమిటి అంటే మనకు మంగళాలు జరుగుతాయి అంటే శుభాలు కలుగుతాయి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 11-07-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గురుపూర్ణిమ. దీనినే వ్యాసపూర్ణిమ అంటారు. వ్యాసుడు శరీరం తీసుకొన్న రోజు, ఆయన విష్ణువు యొక్క అంశ అని చెపుతారు. మునులలో వ్యాసుడను నేను అని పరమాత్మ చెప్పాడు. వేదాలలో ఉన్న సారాన్ని గ్రహించి దానిని మననం చేసేవాడిని ముని అంటారు. భగవద్గీత మనం చదువుతూ ఉంటే అది మనకు అర్థం కాకపోతే అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని దానిని సవరణ చేయటానికి మనకు అవకాశం లేదు. మన తెలివితేటలు ఎంత వరకు వచ్చాయి అంటే భగవద్గీతకు సవరణ చేయటానికి సిద్ధమవుతున్నాము అంటే అది మనం పాడైపోయాము అనటానికి గుర్తు. సన్యాసం అంటే